ఆరోగ్యానికి ముప్పు

- విషం చిమ్ముతున్న ఏడాకుల చెట్లు
- భయాందోళనలో నగర ప్రజలు


మురళీనగర్ వద్ద చెట్లు ఇలా..


మాధవధార జంక్షన్‌లో ఏడాకుల చెట్లు


వర్మ కాంప్లెక్స్ సమీపంలో ఏడాకుల చెట్లు

మర్రిపాలెం : పర్యావరణ పరిరక్షణ కోసం నాటిన చెట్లు ప్రస్తుతం ప్రాణాలకు హాని కలిగిస్తున్నాయని నగర ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆక్సిజన్ ఇస్తాయనుకున్న చెట్లు విషం చిమ్మడంతో చాలా మంది శ్వాసకోస వ్యాధులతో బాధపడుతున్నారు. అసలే నగరంలో కాలుష్యం పెరిగిపోయిందని... దానికి తోడు ఏడాకుల చెట్లు రోగాల బారిన పడేస్తున్నాయని ఆవేదన చెందుతున్నారు. మాధవధార, మురళీనగర్ ప్రాంతమంతా ఏడాకుల చెట్లతో నిండిపోయింది. జీవీఎంసీ 49వ వార్డు మసీద్ జంక్షన్ నుంచి 50, 51వ వార్డుల పరిధిలోని మాధవధార వరకు రోడ్డుకు ఇరువైపులా ఈ చెట్లు విస్తరించాయి. వర్మా కాంప్లెక్స్, మురళీనగర్, మాధవధార, 48వ నంబరు బస్టాప్ మెయిన్ రోడ్డులో ఇరువైపులా ఏడాకుల చెట్లే కనిపిస్తున్నాయి. వీటిని డెవిల్ ట్రీ అని కూడా పిలుస్తారు. పదేళ్ల కిందట గ్రీన్ ప్రాజెక్టులో భాగంగా నగరంలోని చాలా ప్రాంతాల్లో ఈ చెట్లను నాటారు. వీటిని సంరక్షించకపోయినా, నీరు లేకపోయినా ఏపుగా, ఎత్తుగా, పచ్చగా పెరిగిపోతున్నాయి. ఇవి శీతాకాలంలో ఎక్కువగా పూత పూస్తాయి. ఆ సమయంలో వీటి నుంచి వచ్చే వాసన పీల్చడం వల్ల శ్వాసకోశ సమస్యలు, తల నొప్పి ఎక్కువగా వస్తుంటాయి. అలాగే కడుపులో తిప్పడం, వికారం వంటి సమస్యలు వస్తున్నాయని స్థానికులు, వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెట్ల వల్ల ప్రాణహాని ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఆరోగ్య సమస్యలు ఉన్న వారు ఈ చెట్ల నుంచి వచ్చే వాసన పీల్చడం ద్వారా ఆరోగ్యం మరింత క్షీణిస్తుందని అంటున్నారు. మసీద్ జంక్షన్ నుంచి మాధవధార వరకు దారి పొడవునా సుమారు 3 నుంచి 4 కిలోమీటర్ల మేర ఏడాకుల చెట్లు ఉండడంతో రోగాల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ఆ చెట్లు తొలగించాలని వారంతా కోరుతున్నారు.

క్లుప్తంగా

ధనుర్మాస ఉత్సవాలకు ఏర్పాట్లు


శ్రీనివాసనగర్‌లో కొలువైన ప్రసన్న వేంకటేశ్వరస్వామి

సీతంపేట : జీవీఎంసీ 43వ వార్డు అక్కయ్యపాలెం, శ్రీనివాసనగర్‌లో శ్రీలక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి జనవరి 13 వరకు ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రోజూ ఉదయం 5 గంటలకు ప్రాతఃకాలార్చన, తిరుప్పావై సేవ, విశేష భోగం, పాశుర విన్నపం జరుగుతాయని తెలిపారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా పూలంగి సేవ, కూడారై, ఉత్తర ద్వార దర్శనం, విశేష అర్చన నిర్వహిస్తామని తెలిపారు. జనవరి 13న పౌర్ణమి రోజున స్వామికి పంచామృత అభిషేకం, ఉదయం 9 గంటలకు ఆలయంలో గోదా రంగనాయకుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, తదితరులు

సీతమ్మధార : విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఈ నెల 15న నిర్వహించనున్న 'రామ్ మిర్యాల మ్యూజిక్' కాన్సెప్ట్ పోస్టర్‌ను ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ నెల 14న ప్రముఖ గాయని దీపిక, 31న గాయకుడు శ్రీరాం మ్యూజికల్ నైట్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో శ్యామలా దీపిక, బొడ్డేటి ప్రమోద్, చందు పాల్గొన్నారు.

కల్వర్టు పనులకు శంకుస్థాపన


సీతంపేటలో కల్వర్టు పనులను ప్రారంభిస్తున్న గోవింద్, శ్యామల దీపిక

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు గురుద్వారా పాత పెట్రోల్ బంకు వద్ద రూ.7 లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మించనున్నారు. ఈ మేరకు వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, బీజేపీ నాయకురాలు శ్యామల దీపిక కలిసి శుక్రవారం శంకుస్థాపన చేసి అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జీవీఎంసీ డీఈ విజయ్ కుమార్, ఏఈ శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

మర్రిపాలెం : జీవీఎంసీ 49వ వార్డు పరిధి ఏఎస్ఆర్ నగర్ బర్మా క్యాంప్ వద్ద రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని వర్గాలకూ ప్రాధాన్యమిస్తోందన్నారు. రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు ఉపయోగపడతాయన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గోపాలపట్నం తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్, జోన్ – 5 కమిషనర్ బి.రాము, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మైక్రోబయోమ్ రీసెర్చ్‌పై వర్క్‌షాప్


ప్రొఫెసర్ ప్రషెన్ చెలికానితో కళాశాల అధ్యాపక సిబ్బంది

సీతంపేట : మైక్రోబయోమ్ రీసెర్చ్ అండ్ సోషియో ఎకనామిక్ స్టేటస్ రోల్ ఆన్ ఓరల్ హెల్త్ అనే అంశంపై లంకపల్లి బుల్లయ్య కళాశాలలో శుక్రవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కెనడాలోని మానిటోబా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ప్రషెన్ చెలికాని మాట్లాడుతూ 80 శాతం మంది మహిళలు పీరియాడోంటిక్ సమస్యలు, ఆటో ఇమ్యూన్ వ్యాధులకు గురయ్యే అవకాశం ఎక్కువ ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే పట్టణ జనాభా మెరుగైన నోటి ఆరోగ్యాన్ని ఎలా కలిగి ఉంటారో వివరించారు. మైక్రోబయోమ్ పరిశోధన, నోటి ఆరోగ్యం, దాని ప్రభావాలపై ప్రసంగించారు. నాలుకపై రుచి ఎలా కోడ్ చేయబడింది, ఐదు ప్రాథమిక రుచులు, హాట్ అండ్ స్పైస్ రుచులను సోదాహరణంగా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జి.ఎస్.కె.చక్రవర్తి, దీపక్ చౌదరి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్‌వీహెచ్ శ్రీకాంత్, డాక్టర్ పి.సురేఖ పాల్గొన్నారు.

వైభవునికి సుప్రభాత సేవ నేడు


వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేస్తారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పిస్తారు.

ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, మరమ్మతులపై అవగాహన


సదస్సు ప్రారంభిస్తున్న అతిథులు

ఎంవీపీకాలనీ: ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ ఇండియా(ఐసీఏఐ), ఇండియన్ ట్రాన్స్‌ఫార్మర్ మ్యానిఫ్యాక్చర్స్ అసోసియేషన్ సంయుక్తంగా డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్, ఆపరేషన్, నిర్వహణ కోడ్ ఆఫ్ ప్రాక్టీసెస్ అంశంపై సదస్సు నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని సెమినార్ హాల్‌లో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. అతిథులు షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ గ్రూప్ సీఈవో(ఐటీఎంఏ సభ్యుడు), ఐసీఏఐ ఎనర్జీ రెగ్యులేటరీ వ్యవహారాల సలహాదారు మనస్ కుందు, ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్(ఆపరేషన్స్, చీఫ్ జనరల్ మేనేజర్) వి.విజయలలిత తదితరులు జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు, మరమ్మతులు, నిర్వహణ ఖర్చులు వంటి పలు అంశాలపై విద్యుత్ రంగానికి చెందిన నిపుణులు అవగాహన కల్పించారు.

పుస్తక పఠనంపై ప్రచారం అవసరం


కవులకు జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ కూటికుప్పల సూర్యారావు

మహారాణిపేట: ప్రస్తుత కంప్యూటర్ యుగంలో పుస్తక పఠనంపై నిర్లక్ష్యం పెరుగుతోందని, దీని నుంచి గట్టెక్కాలంటే విస్తృత ప్రచారం జరగాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యారావు అన్నారు. అరసం విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో విశాలాంధ్ర విశాఖ 23వ పుస్తక మహోత్సవ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన కవి సమ్మేళనంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. సమాజంలోని కవులందరూ సామాజిక స్పృహతో మెలిగి వాస్తవ పరిస్థితులను ప్రజలకు అందవేయడానికి ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఆత్మీయ అతిథి డాక్టర్ మాటూరి శ్రీనివాసరావు, కవులు ఎస్.హనుమంతరావు, అడపా రామకృష్ణ, రత్నరాజు, ప్రాన్సిస్, బి.కూర్మారావు, బి.రాధారాణి, సత్యవాడ సోదరీమణులు, కె.వి.ఎస్.మూర్తి, స్వర్ణ శైలజ, బసు పోతన భీమేశ్వరరావు, పరమేశ్వరరావు తదితర కవులు పాల్గొని వారి కవితలు చదివి వినిపించారు. అనంతరం కవులందరికీ కూటికుప్పల సూర్యారావు జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు.

కనక మహాలక్ష్మికి విశేష పూజలు


క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 12వ రోజు శుక్రవారం అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక హోమాలు, అమ్మవారికి సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11 : 30 నుంచి 12 గంటల వరకు పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుతోపాటు పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

త్రికాల పంచామృతాభిషేక సేవలో...

అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలచే భక్తులు రూ.7,500, గురువారం మినహా మిగతా రోజుల్లో రూ.2,500 పూజా రుసుము చెల్లించాలి. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 3 వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వేద పండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి


అప్పయ్యమ్మ (ఫైల్)

టీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డుకు చెందిన శతాధిక వృద్ధురాలు మృతి చెందారు. వార్డులోని పితానిదిబ్బ ప్రాంతంలో నివసిస్తున్న పల్లా అప్పయ్యమ్మ(103) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో శుక్రవారం ఆమె ఇంటి వద్ద మరణించారు. అప్పయ్యమ్మకు 11 మంది సంతానం. తన మునిమనవళ్ల ఆలనా.. పాలన కూడా చూశారు.

నేటి నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ శ్యాంబాబు

మహారాణిపేట: జిల్లాలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఏపీఈపీడీసీఎల్ జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ జి.శ్యాంబాబు శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ప్రధాన కేంద్రం, డివిజన్ కేంద్రాల్లో ఈ నెల 20న విద్యుత్ పొదుపుపై అవగాహన ర్యాలీలు నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఇంధన పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తామన్నారు. స్వయం సహాయక మహిళా బృందాలకు ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటింగ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత, నూతన సాంకేతిక విజ్ఞానం అనే అంశంపై నిష్ణాతులతో ఇంజినీరింగ్ కాలేజీల్లో వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళాకారులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలతో ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈఈ బి.సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ పాఠ్యాంశాలు

టీచ్‌రోడ్డు: డిజిటల్ భవిష్యత్తు కోసం విద్యార్థులను సిద్ధం చేయడంలో భాగంగా రాష్ట్రంలోని ప్రభుత్వ మాధ్యమిక పాఠశాలల్లో ఏడు నుంచి తొమ్మిదో తరగతి వరకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) పాఠ్యాంశాలు ప్రవేశపెట్టనున్నట్లు క్వెస్ట్ అలయన్స్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీడ్ సమీరా తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి, క్వెస్ట్ సంస్థకు మధ్య జరిగిన ఒప్పందం గురించి శుక్రవారం మీడియాకు వివరించారు. ప్రాథమిక ఏఐ సాధనాలు, సాంకేతికతను ఉపయోగించడంలో విద్యార్థుల నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఏఐ పాఠ్యాంశాలు రూపొందించినట్లు చెప్పారు. అదే సమయంలో ఈ సాంకేతికతతో ప్రమాదాలు, అసమానతలను విద్యార్థులు అర్థం చేసుకున్నారని నిర్ధారించుకోవాలన్నారు. ఈ ప్రోగ్రాం విద్యార్థులు ప్రాజెక్టుల్లో ఏఐ అప్లికేషన్లను అన్వేషించడానికి అనుమతిస్తుందని పేర్కొన్నారు. సాంకేతికత ద్వారా సృజనాత్మక వ్యక్తీకరణను ప్రోత్సహిస్తుందన్నారు.

కుటుంబం చెంతకు జార్ఖండ్ వాసి


కుటుంబ సభ్యులకు జయా ముండాను అప్పగిస్తున్న శ్రద్ధా ఫౌండేషన్ ప్రతినిధి

సీతమ్మధార: నాలుగేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతున్న జయా ముండా అనే వ్యక్తి భార్యతో గొడవ పడి పని కోసం బెంగుళూరు వెళ్లిపోయాడు. నాలుగు నెలల నుంచి కనపడకుండా పోయి చివరికి వైజాగ్ చేరాడు. అతడిది చాలా పేద కుటుంబం. భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఇతడిది జార్ఖండ్ రాష్ట్రం రామ్‌ఘడ్ జిల్లాలోని దుల్మి గ్రామం. కష్టపడి పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతడిని రైల్వే స్టేషన్‌లో పట్టుకున్న ఏయూటీడీ షెల్టర్ సిబ్బంది, శ్రద్ధా ఫౌండేషన్ సహాయంతో వైద్యం అందించడంతో బాగా కోలుకున్నాడు. వైజాగ్ నుంచి జయా ముండాను నేరుగా తీసుకుని వెళ్లి జార్ఖండ్‌లోని భార్య ఆశాదేవికి అప్పగించినట్లు శ్రద్ధా సోషల్ వర్కర్ ఎం.హరీష, ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం


మధురానగర్ స్కూల్‌లో విద్యార్థితో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్


తరగతి గదిలో ఉపాధ్యాయురాలితో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

సీతంపేట : పదో తరగతి ఫైనల్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేలా వంద రోజుల యాక్షన్ ప్లాన్‌ను ప్రతి సబ్జెక్టు వారీగా టీచర్స్ సిద్ధం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ ఆదేశించారు. 25వ వార్డు మధురానగర్‌లో గల జీవీఎంసీ హైస్కూల్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 8:45 గంటలకు హఠాత్తుగా పాఠశాలకు చేరుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న స్పెషల్ క్లాస్ గదికి వెళ్లి సబ్జెక్టుల వారీగా సిలబస్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విషయ నైపుణ్యాన్ని పరిశీలించారు. ప్రతీ విద్యార్థి పదో తరగతి ఫైనల్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని, సబ్జెక్‌లో సందేహాలున్నా తరగతి గదిలో ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. చదువు ఆవశ్యకత, విద్యార్థి దశలో టెస్ట్ పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన కౌశల్ క్విజ్ పోటీలో ప్రథమ స్థానం సాధించిన తొమ్మిదో తరగతి విద్యార్థి పి.చరణ్‌కుమార్‌ను డీఈవో అభినందించారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో సమావేశమై మార్చి నెలలో జరగనున్న టెస్ట్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతకు వంద రోజుల యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు. సమ్మేటివ్ – 1 ప్రశ్నాపత్రాలు స్కూల్ కాంప్లెక్సు పరిధిలో ఉన్న అన్ని పాఠశాలలకు పంపిణీ చేసే విధానాన్ని పరిశీలించారు. పబ్లిక్ ఎగ్జామ్స్ తరహాలో సమ్మేటివ్ నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు శాంతి కుమారి, బి.దేముడుబాబు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత విద్యావంతులు కావాలి

సీతమ్మధార : విద్యార్థులు చక్కగా చదవుకుని ఉన్నత విద్యావంతులు కావాలని డీఈవో ప్రేమ్‌కుమార్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్లస్ (ఎస్ఎంసీ హెచ్)ను ఆకస్మాత్తుగా సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల గదికి వెళ్లి సబ్జెక్టుల వారీగా సిలబస్‌ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విషయ నైపుణ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఇంజినీరింగ్, మెడిసన్ చేయాలని సూచించారు. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయుల కు మంచి పేరు తేవాలన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని వారు చక్కగా చదివేలా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం డి.రాంప్రసాద్ పాల్గొన్నారు.

అదుపు తప్పితే బాధ్యులెవరు..?



ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహనదారులకు అవగాహన కల్పించడంతోపాటు... నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాల్సిన ట్రాఫిక్ పోలీసులే ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతున్నారు. అక్కయ్యపాలెం రోడ్డులో శుక్రవారం రాత్రి ఒక కానిస్టేబుల్ వాహనం ఆగిపోవడంతో వెనుక మరో కానిస్టేబుల్ తన బైక్ నడుపుకుంటూ... ఓ కాలితో ముందున్న బైక్‌ను తోస్తున్నాడు. చూసే వారికి ఇది సాయం చేస్తున్నట్లు కనిపించినా... ఏమాత్రం అదుపు తప్పినా... అదే సమయంలో వేరే వాహనదారులు వేగంగా వచ్చినా అందరూ ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. గతంలో బీచ్‌రోడ్డులో ఇలా వెనుక బైక్ మీదున్న వ్యక్తి ముందున్న వాహనదారుడికి సాయం చేసేందుకు కాలుతో తోస్తుండగా... ఇద్దరినీ లారీ ఢీకొనడంతో ఒకరు ఘటనా స్థలిలోనే చనిపోయారు. ఇలాంటి చర్యలకు పోలీస్ ఉన్నతాధికారులు అడ్డుకట్ట వేయాలని నగరవాసులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఎల్‌ఐసీ ఏజెంట్ల సంక్షేమానికి ఉద్యమిస్తాం


ధర్నాలో మాట్లాడుతున్న గజపతిరావు

డాబాగార్డెన్స్ : జీవిత బీమా సంస్థలో పనిచేస్తున్న ఏజెంట్ల సంక్షేమానికి ఉద్యమిస్తామని ఆలిండియా లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ) చైర్మన్ ఎన్.గజపతిరావు తెలిపారు. ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోరుతూ లియాఫీ సౌత్ సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్ఐసీ డివిజినల్ కార్యాలయం వద్ద మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న గజపతిరావు మాట్లాడుతూ ఏజెంట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత సంస్థ యాజమాన్యంపై ఉందన్నారు. ఏజెంట్లకు పాత పద్ధతిలోనే కమీషన్లు కొనసాగించాలని డిమాండ్ చేశారు. పాలసీదారులకు బోనస్ పెంచాలని, ఏజెంట్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ వయస్సు పెంచాలని కోరారు. కనీస బీమా రూ.లక్షగా ఏర్పాటు చేయాలని, ఏజెంట్లందరికీ మెడీ క్లెయిమ్ వర్తింపజేయాలని పేర్కొన్నారు. లియాఫీ సౌత్ సెంట్రల్ డివిజన్ అధ్యక్షుడు బి.తిరుమలరావు మాట్లాడుతూ 68 ఏళ్లుగా ఉన్న ఎల్ఐసీ పద్ధతుల్లో మార్పులు తీసుకొచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పాలసీపై జీఎస్టీ పెంపు, మెచ్యూరిటీ బోనస్ తగ్గించడం, ఎంట్రీ వయస్సు 50 ఏళ్లకు తగ్గించడం, ప్రీమియం రేట్లు పెంచడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తక్షణమే నూతన విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. మహాధర్నాలో జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.శివకుమార్, డివిజినల్ సెక్రటరీ ఎస్‌వీఆర్ వేంకటేశ్వరరావు, డివిజినల్ ట్రెజరర్ వీవీఎస్ కామేష్, జోనల్ ఈసీ మెంబర్ బీవీ రమణ, లియాఫీ ఈసీ మెంబర్స్ కేవీ రమణ, సీవీ రవికుమార్‌తోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి సుమారు 1200 మంది ఏజెంట్లు పాల్గొన్నారు.